# ఉద్యోగ యత్నం

'రాజా'

"నేను ఉద్యోగం సంపాదించాలంటే ఏం చెయ్యాలి?" అని అడిగాను ఒకాయన్ని.

ఆయన ఆఫీసులో హెడ్‌క్లార్కుపని చేస్తున్నాడు. ఆయనకి ఆ ఉద్యోగంలో మంచి అనుభవంకూడా వుంది.

నేను ప్రశ్న అడిగిన పావుగంటకి ఆయన కాగితాల్లోంచి ఒకసారి తేలి రెండుసార్లు బీడీలోంచి పొగపీల్చి చెప్పాడు.

ఉద్యోగ సంపాదనకి రెండు కిటుకులున్నాయి. మొదటిది రికమెండేషన్ సంపాయించడం. రెండోది తైరుకొట్టడం. మొదటిదానివల్ల ఉద్యోగం వచ్చేస్తుందని రూఢీలేదు. కాని రెండోదానివల్ల నిక్కచ్చిగాను, నికరంగానూ, ఉద్యోగంవచ్చేసిందనే భావించవచ్చు కాని ఈ తైరుకొట్టడం ఉందే అందులో కొద్దిగా సుళువులు బళువు లున్నాయి. కాస్త డబ్బు ఖర్చౌవుంది, కాని దాన్ని నువ్వు చక్కగా నిర్వహించ సమర్థుడ వనుకుంటాను." అని ఒక చిన్న లెక్చరు దంచేసి మళ్ళా తనకాగితాల్లో మునిగిపోయాడు.

నేనాయన దగ్గిర్నించి శలవు తీసుకొని బయలుదేరాను. దారిపొడుగుతా నాకు ఆతైరుకొట్టే విధానాలే మెదలుతున్నాయి మనస్సులో.

నేను పరీక్షప్యాసై, నాపేరు చివర ఒకడిగ్రీ తగిలించుకున్నాను. ఒకరోజు మామయ్య నన్ను పిలిచి "ఒరే, నీ చదువు పూర్తి అయిందిగదా! ఇంక ఊళ్ళ వెంబడి ఉద్యోగంకోసం పరుగెత్తు, నీకొక మంచి కిటుకు చెప్తాను యిక్కడి అధికారం అంతా కలెక్టరుగారి చేతుల్లోవుంది. కాని వెళ్ళేముందర ఒకపని చెయ్యాలి. ఎంత జాగ్రత్తగా మసులుకోవాలో తెలుసా? ఆయనకి ఒక అయిదేళ్ళ కొడుకున్నాడు. ముందర వాడిస్నేహం చేసుకో. తరవాత వాడిద్వారా ఆయన గదుల్లోకి వెళ్ళి సీరియస్‌గా ముఖంపెట్టి ఆయన షెల్ఫులో పెట్టుగున్న గ్రంధాలన్నీ తిరగేస్తూఉండు చిట్టచివరికి ఒకరోజు నువ్వు ఆయన దృష్టిలో పడతావు వెంటచే తియ్యతియ్యటి మాటలు ఆయనమీద ప్రయోగించి మధ్యమధ్య ఆ అబ్బాయిని బుజ్జగిస్తూ, నీ పిటీషన్ని ఆయన కళ్ళముందు పడెయ్యి, ఆ అబ్బాయికూడా "నాన్నా, ఈయన చాలామంచి వారు" అని చెబుతాడు అంతే చాలు, నీకు ఉద్యోగం వచ్చిందన్నమాటే, ఇంక ఉపక్రమించు," అన్నాడు

ఇది నాకు ఏమాత్రము ఇష్టంలేదంటే ఆశ్చర్యపడ అక్కరలేదు, కాలేజీల్లో చదువుకునేటప్పు డెప్పుడూ నాకు ఇలాంటి అనుభవంలేదు. అంతేకాదు, ఇలాంటి వెన్నడూ చెయ్యకూడదని ఆదర్శంగా పెట్టుకున్నాను. అంచేత వెంటనే మామయ్యతో అన్నాను "యిదినాకు సుతరామూ యిష్టంలేదు. తైరుకొట్టడం అంత ఘోరం అదేగాని ఇంకేదీలేదు," అని

మామామయ్య నవ్వి, "ఒరేయ్, మీ చదువుకున్న కుర్రాళ్ళని చూస్తూంటాను ఏమిటో పెద్ద పెద్ద ఆదర్శాలు పెట్టుకున్నా మనుకుంటారు. ఆదర్శప్రేమ అనుకుంటారు "ప్రేయసీ, నిను చూచిన ప్రథమ క్షణంనించీ నాహృదయం నిన్నే పవిత్రంగా ప్రేమిస్తోంది, అధర మధుర గేయాలతో రుధిర మదిర జీవంపోసి ఆలాపిస్తా" అంటూ ప్రేమ లేఖలురాస్తారు కాని జీవితంలో యిలాంటి వేమీ సాగవని నీకు తెలియదు. కాశీలో యింజనీరింగు చదివి వచ్చిన ఒక అబ్బాయి యిలాంటి ఆదర్శాలనే పెట్టుకున్నాడు. కాని తీరా ఆ అబ్బాయికి పెళ్ళిచేశాక యిప్పుడు

తెలుసుకున్నాడు. ప్రేమించి చేసుకున్న పెళ్ళి సంగతేమోగాని. వాళ్ళిప్పుడు ఒకళ్ళనొకళ్లు సాధించుకోడాలతో తీరిపోతోంది.

"కాబట్టి నీ ఆదర్శాల్ని నీకాలేజీ చదువుల్ని మర్చిపో. ప్రపంచంలో తైరుకొట్టడం అంత మంచిది లేనేలేదు. నీకింకా ప్రపంచం అంటే ఏమో తెలియదు. నే చెప్పినట్టు చెయ్యి. వెళ్లు" అని నన్ను మళ్ళీ మాట్లాడనియ్యకుండా పంపించేశాడు.

కాని నేను తృప్తిపడక ఆదర్శం ఎందుకు కొనసాగదో చూద్దా మనుకున్నాను అంచేత ముందర అన్నిచోట్లకీ, అన్ని ఉద్యోగాలకీ అప్లయిచేశాను. కాని ఫలితం సున్నా. చివరకీ హెడ్ క్లార్కు దగ్గరకెళ్ళాను. ఆయనా అదే చెప్పాడుగద! అంచేత చివరికి మామామయ్య సలహానే అనుసరించాల్సి వచ్చింది

ముందర కలెక్టర్ని చూడాలి దానికాక్కావాల్సిన ఇన్ ఫర్ మేషన్ అంతా తెలుసుకున్నాను. కలెక్టరు గారి అబ్బాయికి అయిదేళ్లు అనీ, ఆ అబ్బాయి నల్లగా, అసహ్యంగా, కురూపంగా ఉంటాడనీ తెలిసింది, వాళ్ళ కనిపెట్టడం కోసమని రోజూ ఆకలెక్టరు బంగాళాముందు నిలబడేవాణ్ణి. ఇలాగ మూడురోజులు గడిచింది, కాని ఆబాలచంద్రుని జాడలేదు. నేను నిరాశచెందకుండా పొద్దున్నా సాయంత్రము కూడా బయటే కాసేవాణ్ణి.

ఇలా మూడురోజులు కాళ్ళు పీకేలా నిలుచున్నాను నాలుగోనాడు నా కన్నుల పండువుగా ఆ బంగాళాలోంచి ఒక కుర్రాడొచ్చి ఆగేటుమీద ఎక్కుతుండడం చూశాను.

వాడికి రమారమి అయిదేళుంటాయని ఊహించాను. వాడి శరీరం పంసిలావుంది. వాడు కుళ్లుబట్టలు కట్టుకొన్నాడు జుట్టు చింపిరిగావుంది వాడు నల్లగా ముట్టుకుంటే మసి అంటుకునేట్టుగా ఉన్నాడు ఈకారణాలచేత వీడు తప్పకుండా కలెక్టరుగారి అబ్బాయి అయి ఉంటాడని రూఢి చేసుకున్నాను,

ఎందుకేనా మంచిదని అఅబ్బాయిని పిలిచి "అబ్బాయ్, నువ్వేనా కలెక్టరుగారి అబ్బాయివి?" అన్నాను.

"అవును. నాకేమన్నా తినడానికి తెచ్చావా?" నోరుఊట ఊరుతూ, పెద్ద గొంతుకతో అడిగాడు. వాడి గొంతుక వాడి స్వరూపాన్ని మించిందిరా అనుకున్నాను,

వాడి వాలకంచూసి మరొహప్పుడయి నట్టయితే ఛెళ్ళున ఒక్క లెంపకాయ యిచ్చుకొని యుందును. వాణ్ణి తన్నేందుకు నాకాలు యించుమించు లేచింది, యింతట్లోకే మామాయ్య నన్ను పంపిన సందేశం గుర్తుకొచ్చి అదే పొజిషనులో అల్లానేఆగిపోయాను. నే నిప్పుడు వాడితో దెబ్బలాటలు పెట్టుకోకూడదు, వాణ్ణి మంచి మాటలు చేసుకొని స్నేహం కలుపుకోవాలి.

నేను వెంటనే నాచెయ్యి జేబులో పెట్టి ఒక కారప్పూస పొట్లాం బయటికి తీసానోలేదో వాడు వెంటనే దాన్ని గద్దలా లాక్కొని నోట్లో పోసుకుని బొక్కడం ఆరంభించాడు. నాకు వాడి తిండివరుస చూచి ఒళ్ళు మండుకొచ్చింది, కాని ఏంచేసేది? వాడు ఒక్క నిమిషంలో అంతా తినేసి, ఒక్క క్షణంలో అక్కణ్ణుంచి పరిగెత్తుకుంటూ మాయ మయ్యాడు నేను నిజంగా నిశ్చేష్టుణ్ణయిపోయాను అరగంటదాకా అలాగే నిలబడి పోయాను.

మర్నాడు యిల్లానే వాడు తినుబండారాలు తిన్నాడు. కాని మొదటి రోజులాగ కాకుండా వాడు తినేసిన అనంతరం నన్ను ఎత్తుకోమన్నాడు, ఆకోతి మొహాన్ని ఎత్తుకోడం ఎలాగా అని మొదట్లో తటపటాయించాను. కాని యిదంతా పెద్ద మనుషులతో వ్యవహారం!

ఈ కారణంగా వాణ్ణి నేను ఎత్తుకున్నాను వాడొహ పిల్ల ఏనుగంత బరువున్నాడంటే నమ్మండి, వాడు బాడీలోనూ గ్రాండొర్లాడేమో నాతెల్లటి యిస్త్రీ బట్టలు వాడితో ఖరాబయ్యాయి వాణ్ణి కిందికి ఎత్తి కుదేద్దా మన్నంత కోపంకూడా వచ్చింది, కాని చేసేది లేక నేను వాణ్ణి మెల్లగా బుజ్జగిస్తూ "మాఅమ్మ. నువ్వింక చక్కగా ఆడు

కుంటావు కదూ, బంగారు తండ్రిలే!" అని ధ్ధింపాను.

మాస్నేహం క్రమంగా పెరిగింది. నేను కేవలం నామానసిక బలంతో (నాభౌతికబలం కాస్తా మొదటిరోజు వాణ్ణి ఎత్తడంతోనే సరి) వాణ్ణి రోజూ ఎత్తుకునేవాణ్ణి.

ఇలాగ పదిరోజులు గడిచాయి. ఓమధ్యాహ్నం గులాబ్‌జాముల పొట్లం వాడి చేతులో పెట్టాను. యింతలోకే యింకో కుర్రాడుకూడా రంగంమీదికి అవతరించాడు. వాడు పీణిమించిన కురూపంగా వున్నాడు. వాణ్ణి చూశాక, "పోనీలే, కలెక్టరు గారి అబ్బాయిని మించిన కురూపులు కూడా ఉన్నారీ ప్రపంచంలో. అలాంటి వాళ్ళకి చాకిరీ చెయ్య నవసరం లేనందుకు సంతోషించు" అని నన్ను నేను సముదాయించుకున్నాను.

ఆక్రొత్త కుర్రాడు కలక్టరుగారి అబ్బాయిదగ్గర కొచ్చి "ఏయ్. అది నాకిలాయియ్యి" అన్నాడు.

"ఉహుం, ఇవ్వను".

గారాంగా బుంగమూతి పెట్టాడు కలెక్టరుగారి అబ్బాయి. ఇంక వాడి ఆకారం చెప్పాలా?

"ఇవ్వవూ? ఇలారా గాడిదకానా!" అని చెప్పి ఆ క్రొత్తకుర్రాడు వెంటనే కలెక్టర్‌గా రబ్బాయితో కలియబడ్డాడు. కలక్టర్‌గా రబ్బాయి మాత్రం తక్కువవాడా. ఆ క్రొత్తకుర్రాడి వీపు మీద ఒకగుద్దుగుద్దాడు. ఆకొత్తకుర్రాడు కలెక్టర్ గారి అబ్బాయిని లేగ్‌బ్రేక్ వేసి క్రిందపడేశి దుమ్ములోపడ్డ పొట్లాం ఊదుకుంటూ పరుగు ఆరంభించాడు.

నేనిదంతా యింతవరకూ చూస్తున్నా నాకు కర్తవ్యం ఏమాత్రం బోధపడలేదు. ఆకొత్త కుఱ్ఱాడు కొద్దిదూరంలో నించుని పొట్లంయిప్పు తుంటే అప్పుడు తెలివివచ్చి వాడిదగ్గరకి పరుగెత్తుకొనివెళ్ళి కలక్టర్‌గా రబ్బాయికి వాడు ముట్ట చెప్పిన దెబ్బల్ని వడ్డీతోసహా తిరిగి చెల్లించి పొట్లం లాక్కుని, కలెక్టర్‌గా రబ్బాయి పడి వున్న చోటు చేరాను. ఆక్రొత్త కుర్రాడు కేరు మని ఏడుస్తూ చక్కా పోయాడు.

అప్పటికి కలక్టర్‌గా రబ్బాయి యింకాదుమ్ము లోనే పడి వున్నాడు. నేను వాణ్ణి లేవనెత్తి, తియ్యతియ్యటి మాటల్తో బుజ్జగించి, పొట్లం వాడిచేతులో పెట్టాను

యింతటిలో బంగాళా తలుపులు దీసుకుని పది మంది బయటికి వచ్చారు అందులో ఆక్రొత్త కుర్రాడూ ఎనమండుగురు బంట్రోతులూ. ఒక పెద్ద ఆజానుబాహువులాంటి మనిషీ వున్నారు ఆమనిషే కలక్టరని ఊహించడానికి నాకట్టే కాలం పట్టలేదు.

చిరకాలా కాంక్షిత దర్శనం! యిలాంటి సందర్భం మళ్ళా ఎప్పుడు సంభవిస్తుంది? నేను వెంటనే వినయంగా, విధేయతగా వంగి దణ్ణం పెట్టి ఒక చిరునవ్వు నవ్వాను

కలక్టర్‌గారు ఇది ఏమాత్రం గమనించినటుల యినా కనిపించలేదు,

"ఏయ్ నువ్వెందుకు మాఅబ్బాయినికొట్టావు"? అని గర్జించారు కలక్టర్‌గారు

నేనాశ్చర్యంగా "తమరు ..స ...సరిగా చూడ లేదు ..నేనేమీ కొట్టలేను" అంటు కలక్టర్‌గా రబ్బాయిని కొద్దిగా నిమరడం ఆరంభించాను కలక్టర్‌గారి మెప్పు పొందొచ్చుగదా అని.

"ఆఁ? అబద్ధంకూడానా? నువ్వు కాకపోతే యింకెవరు కొడుతారు?" అన్నాడాయన,

నేను వెంటనే "మీదగ్గర నిలుచున్నాడే కుర్రాడు,—ఆరాలుగాయి వెధవ కొడుతుంటే నేను కళ్ళార చూశాను" అనేశాను

కలక్టర్‌గారి కళ్ళు నిప్పులా మెరిసాయి, "ఆఁ నాకొడుకునే రాలుగాయి వెధవ అనడానికి నీకు నోరెలా వచ్చింది? నాజవాను కొడుకుని రాసుకు తిరిగే నీకెక్కడుంది తాహతు అలా అన డానికి? ఒరే, జవాన్, వీణ్ణి వెళ్ళగొట్టండి—గెటవుట్" అంటూ ఆకొత్త కుర్రాణ్ణి ఎత్తుకుని లోపలికి వెళ్ళాడు.

నేనిదంతా తెల్లబోయి మననం చేసుకునేలో గానే నాలుగుజతల చేతులు నన్నవతలికి గెంటాయి

డామిట్! కథ అడ్డంగా తిరిగింది!!